ఉపాధి లేకుండా పోయింది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడిచిన 4 నెలలుగా ఉపాధి కూలీలకు రావాల్సిన వేతనాలు అందక ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. మరోవైపు నిజాయితీగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లనర్యక్ష పూరితంగా వ్యవహరిస్తూ తొలగించారు. దీంతో వారంతా వీధిన పడ్డారు. ఉపాధిహామీ పథకం కూటమి నేతలకు కల్పతరువుగా మారింది. చోటా నేతల నుంచి పెద్దస్థాయి నేతల వరకు పంపకాలు జరుగుతున్నాయి. అందుకే ఉపాధి పనులన్నీ కూటమి నేతల కనుసన్నలోకి వెళ్లాయి. ఉపాధి పనులకు పోవాలంటే కూలీలు ఆందోళన చెందుతున్నారు.

- ఉపాధి కూలీల ఆకలికేకలు
- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా తొలగించి.. తమకు అనుకూలమైన వారిని పెట్టుకున్న వైనం
- కూటమి నేతలకు కల్పతరువుగా ఉపాధి హామీ పథకం
- పనులు చేసే చోట కనీస వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు



నియోజకవర్గాలు:	3
గూడూరు మండలాలు:	5
వెంకటగిరి మండలాలు:	6
సూళ్లూరుపేట మండలాలు:	6
జాబ్‌కార్డులు:	75 వేలు
పనులకెళ్లే కూలీలు:	50 వేల మంది వరకు
తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లు:	200 మంది
కూలీలకు చెల్లించాల్సిన వేతనం (సుమారు) :	రూ.30 కోట్లు

సైదాపురం : వలసలు నివారించి గ్రామాల్లోనే నిరుపేదలకు ఉపాధి కల్పించే పథకం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అస్తవ్యస్తమైంది. గత కొన్ని నెలలుగా పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. ప్రతి కూలీకి రోజువారి వేతనం రూ.305గా నిర్దేశించగా.. కూలీలకు మాత్రం రూ.275 ప్రకారమే ఇస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

మెట్లు పనులు చేయిస్తున్నారు..

కూటమి నేతలకు ఉపాధిహామీ కల్పతరువుగా మారింది. వారి జేబులు నింపుకునేలా పనులు చేపడుతున్నారు. గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమకు అనుకూలంగా ఉన్నవారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా పెట్టుకున్నారు. అయితే కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు తమను అన్యాయంగా తొలగించారని కోర్టును ఆశ్రయించగా.. కొనసాగించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా వారిని పనిలోకి తీసుకోకుండా కూటమి నేతలు మండల, జిల్లాస్థాయి అధికారిపై ఒత్తిళ్లు చేసి తీసుకోకుండా చేస్తున్నారు. గూడూరు, సూళ్లూరుపేటలో గత ప్రభుత్వ హయాంలో పని చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా తొలగించారు.



చిల్లకూరులో సామాజిక సదస్సును నిర్వహిస్తున్న అధికారులు

తాగడానికి నీరు కూడా లేక..

ఉపాధి కూలీలకు నిలువ నీడలేదు. మండుటెండలో విలవిల్లాడుతున్నారు. వేసవిలో భానుడు ఉగ్రరూపం దాల్చడంతో కనీసం తాగడానికి మంచి నీరు కూడా అందుబాటులో ఉండడం లేదు. పని చేసే సమయంలో చిన్నచిన్న గాయాలవుతుంటాయి. ఈ సమయంలో ప్రాథమిక చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు పని ప్రదేశంలో ఉండాలి. వాటిని కూడా ప్రభుత్వం ఇంత వరకు సరఫరా చేయలేదు. డీహైడ్రేషన్‌కు గురైతే కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గతంలో వేసవిలో కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడంతో పాటు ఎండల్లో పనిచేసే వారికి టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు. కానీ ఇటీవల కూలీలకు ఈ సౌకర్యాలు ఏవీ ఉండడం లేదు.

అకారణంగా తొలగించారు..



ఏ తప్పు చేయకపోయినా కూడా కూటమి ప్రభుత్వం నేతలు నాపైలేనిపోని అభియోగాలు మోపారు. సోషల్ ఆడిట్‌లో కూడా నాపై మోపిన అభియోగాలు రుజువు చేయలేకపోయారు. ఏ తప్పు చేయలేదని అధికారులే నిర్ధారించారు. అయినా కూటమి నేతలు అకారణంగా తొలగించేశారు.

– కాకాణి చంగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చిట్టమూరు మండలం

సకాలంలో చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు ప్రభుత్వం స్పందించి సకాలంలో చెల్లించాలి. ఉపాధి పనులను నమ్ముకుని గ్రామాల్లో ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి నగదు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించాలి.

– రవికుమార్, బాలాయపల్లి

కడుపు కొట్టారు..



ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టిన సమయంలో కొలతల్లో అప్పుడప్పుడు తేడాలు వస్తుంటాయి. వాటిని కూటమి నేతలు భూతద్దంలో చూపించి జిల్లా అధికారిపై ఒత్తిడి తెచ్చి ప్రజా వేదికలో భారీగా తప్పులు చేసినట్లు చూపించారు. వాటికి ఆధారాలు చూపించకుండా అధికారులు కూడా నన్ను తొలగిస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నేతలు నాలాంటి వారి ఎంతోమంది కడుపు కొట్టారు.

– గంగాధర్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, వరగలి, చిల్లకూరు మండలం

కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయలేదు



కోర్టు ఉత్తర్వుల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేర్చుకోవాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసినా.. కూటమి నేతల ప్రలోభాలకు అధికారులు ఆ ఉత్తర్వులను కూడా బేఖాతరు చేశారు. ఉపాధి హామీ పథకం ప్రారంభం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నా. ఏ తప్పు చేయకపోయినా కూటమి నేతల ఆదేశాల మేరకు అధికారులు నన్ను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. నాకు రావాల్సిన జీతం కూడా ఇవ్వలేదు. మా కడుపులు కొట్టిన వారికి ఆ దేవుడే బుద్ధి చెబుతాడు.

– శ్యామల, పొక్కందల ఫీల్డ్ అసిస్టెంట్, సైదాపురం

బతుకుపై వేటు వేశారు ..



కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మా బతుకులపై వేటు వేశారు. మేము వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నామనే నెపంతో కూటమి నేతలు మమ్మల్ని ఉపాధి పనుల నుంచి తొలగించేశారు. మేము న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు కూడా స్థానిక నేతలు చెప్పిన వారికే ప్రాధాన్యత ఇచ్చి మమ్మల్ని విధుల నుంచి తొలగించారు. మా కుటుంబం వీధిన పడింది.

– సుబ్బమ్మ, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, వేములచేడు, సైదాపురం మండలం

ఆకలితో అలమటించాలి..



ఉపాధిహామీ పథకం పనులు చేసిన కూలీలకు సకాలంలో కూలి చెల్లించకపోవడంతో ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంతేగాకుండా వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు. దీంతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.

– పోలూరు వీరమ్మ, జంగాలపల్లి పంచాయతీ, వెంకటగిరి రూరల్ మండలం

క్లుప్తంగా

నేడు సన్నాహక సమావేశం

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు విషయంలో ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సందర్భాన్ని పురస్కరించుకుని జూన్ 4న వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమంపై శనివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లోని ఆయన నివాసంలో శనివారం కార్యకర్తలతో కలసి ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

యోగాతో ఒత్తిడి దూరం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం ఎంపీడీఓ, పొదుపు కార్యాలయాల్లో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ భవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. ఈ మేరకు టీఓటీల ద్వారా యోగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 16వ తేదీన పెంచలకోనలో యోగాంధ్ర జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



పాండురంగస్వామిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

రాపూరు: మండలంలోని సైదాదుపల్లి అరుంధతీవాడలోని పాండురంగస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రుక్మిణీదేవి, సక్కుభాయి సమేత పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి వివిధపుష్పాలు, ఆభరణాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

రేషన్ షాపుల్లో తనిఖీలు

వాకాడు : మండలంలోని రేషన్ షాపుల కాటాలపై జిల్లా తూనికల కొలతల అధికారి వీరేంద్ర కుమార్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన ఆయన అన్ని రేషన్‌షాపుల డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. డీలర్లు వినియోగించే ఈ–పాస్, వేయింగ్ మిషన్లను తనిఖీలు చేసి లోపాలను సరి చేశారు. అనంతరం మిషన్ల విధి విధానాలపై డీలర్లుకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా చిన్నపాటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

లారీ బోల్తా



పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో చిల్లకూరు గ్రామం వద్ద శుక్రవారం యూరియా లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలు.. తమిళనాడులోని రాణిపేట నుంచి ఏలూరుకు యూరియా లోడుతో వెళ్తున్న లారీ మార్గమధ్యలోని చిల్లకూరు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో లారీ డ్రైవర్‌కి గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన గంధోత్సవం



గంధాన్ని తీసుకొస్తున్న దర్గా కమిటీ సభ్యులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలో ఉన్న హాజరత్ ఖాదర్‌షావలీ (చిన్నదర్గా) గంధోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకున్న.. శ్రీవారి గంధాన్ని ముజావర్లు, ఫకీర్ల విన్యాసాల నడుమ దర్గాలో ప్రతిష్ఠించి ఫతేలు జరిపారు. మధ్యాహ్నం గిండి రోహిణి కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దర్గా వద్ద వందలాది మందికి అన్నదానం జరిపారు. చిన్న దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

దక్కిలి: మండలవ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పలుగోడు గ్రామంలో సర్వే నంబరు 1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఆక్రమణ భూమిని పరిశీలించి అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల్లోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో ఆమని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముంగమూరమ్మకు ప్రత్యేక పూజలు



కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

ఓజిలి: మండల పరిధిలోని ఆర్మేనిపాడు గ్రామ దేవత ముంగమూరమ్మ అమ్మవారికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. 10వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి అభిషేకాలు, హారతులు ఇచ్చి పూజలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు అధికసంఖ్యలో అమ్మవారి అర్చన చేసేందుకు పుష్పాలు, నీటిని తీసుకొచ్చారు. ఆలయంలో పండితులు మహిళలతో సహస్ర కుంకుమార్చన వైభవంగా చేశారు. అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కుంకుమార్చన కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు అన్ని సౌకర్యాలను కమిటీ సభ్యుడు తాడిపర్తి శోభన్ సమకూర్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. రాత్రి ఆలయంలో భజనలు ఆకట్టుకున్నాయి.

శ్మశానస్థల ఆక్రమణదారులపై చర్యలేవి ?



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంక్షేమ సంఘం నేతలు

బాలాయపల్లి(సైదాపురం) : గిరిజనుల శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ ఆరోపించారు. గిరిజనుల శ్మశాన స్థలం ఆక్రమణకు గురికావడం పట్ల గిరిజన సంక్షేమసంఘం ఆధ్వర్యంలో బాలాయపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మన్నూరు గ్రామంలో గిరిజనుల శ్మశాన స్థలాన్ని జడపల్లి రమణయ్య అనే వ్యక్తి ఆక్రమించారని, దీనిపై ఇటీవల పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని.. అయినప్పటికీ అతనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాము ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తూ, కులం పేరుతో దూషిస్తూ దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శ్మశానస్థలం ఆక్రమించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఎక్కడ మేడమ్ ?



మాట్లాడుతున్న చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి

సూళ్లూరుపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అభివృద్ధి ఎక్కడ ? అని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో 30 అంశాలను అజెండాలో పెట్టి సమావేశంలో చదివి వినిపించగా అందులో 28 పనులను కౌన్సిల్ ఆమోదించింది. ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మున్సిపాలిటీలో ఇంటి పన్నులు విపరీతంగా పెంచేసి మోత మోగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని చోట్ల రోడ్లు, డ్రైన్లు లేవని, పార్కు వీధిలో సీసీ రోడ్లు వేయాలని కోరారు. జీఎన్‌టీ రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభాలకు అధికార పార్టీ నేతలకు చెందిన ఫ్లెక్సీలు కట్టడంతో రోప్‌లైటింగ్ కట్ అయిపోయి వెలగడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు.

మా సమస్యలు పరిష్కరించండి మేడమ్



ఆర్డీవోకు విన్నవించుకున్నంటున్న అర్జీదారులు

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలోని కలువాయి తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మకూరు ఆర్డీఓ పావని ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌కు అర్జీదారులు పోటెత్తారు. అత్యధికంగా భూముల ఆక్రమణలు, సర్వే సమస్యలకు సంబంధించి 300 పైగా అర్జీలు వచ్చాయని, వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి పరిష్కరిస్తామని ఆర్డీఓ పావని తెలిపారు. ఇటీవల వివాదాలకు కారణమైన కలువాయి నాయీ బ్రాహ్మణ కాలనీ భూమి పట్టాల విషయమై ఇరువర్గాల వారు ఆర్డీఓకి ఫిర్యాదు చేశారు. కలువాయి గ్రామానికి చెందిన కొడికుతల నాగమణి ఇంటి సమస్యపై ఆర్డీఓ పావని క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లగా అక్కడ ఇరువర్గాల వారు కొట్టుకోవడంతో ఆమె వెనుదిరిగారు. స్థానిక తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ సరిగా పనిచేయడంలేదని, రెవెన్యూ సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని జనసేన కన్వీనర్ మనోహర్ ఆర్డీఓకి ఫిర్యాదు చేశారు. అధికారులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

చిట్టమూరు : మండలంలో అన్ని రకాల పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ మనోహర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో మొత్తం 5,760 మందికి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయ సిబ్బందికి నగదు అందజేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేయండి



మేరిగ మురళీధర్‌ను సత్కరిస్తున్న పట్టణ వాసులు

చిల్లకూరు: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్ ప్రాంతంలోని ఆయన నివాసంలో శుక్రవారం మేరిగ మురళీధర్‌ను కడివేడు, గూడూరు పట్టణానికి చెందిన పలువురు పార్టీ నేతలను కలుసుకున్నారు. త్వరలో గ్రామాల్లో పర్యటించి ప్రతి ఒక్కరికి అండగా ఉండేలా కృషి చేస్తామన్నారు. మేరిగను కలసిన వారిలో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ శెనగల వెంకట్రావ్, అరుణ్, కడివేడు నాయకులు ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ



గూడూరు రూరల్: పట్టణంలోని సంగం థియేటర్ కూడలి వద్ద రోహిణి సింధూరి జన్మదిన వేడుకలను భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భారతదేశంలో ప్రభుత్వ కార్యాలయాల్లో నిజాయితీగా పనిచేసే అతి కొద్ది మంది అధికారుల్లో రోహిణి ఒక్కరని, ఆమె దేశభక్తి కలిగిన గొప్ప మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీగౌరి, గుబ్బా నరసింహులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం





రాపూరు: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, నాయుడుపేటటౌన్‌లో..

రాపూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరులో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొడ్డు మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం వారు రాపూరు బాలాజీ కాంప్లెక్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నిరసనర్యాలీ, అనంతరం సమావేశం ఉంటుందన్నారు. నియోజకవర్గం నుంచి అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుమేరకు జూన్4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



పొర్లుకట్ట ధ్వంసంపై స్పందించని అధికారులు





స్వర్ణముఖి పొర్లుకట్టను తొలగించి దారి ఏర్పాటు చేసిన దృశ్యం, స్వర్ణముఖి నదిలోకి వాహనాలు వెళ్లకుండా దారికి అడ్డంగా గాడి తీయించిన దృశ్యం

పెళ్లకూరు: మండలంలోని కప్పగుంటకండ్రిగ గ్రామం వద్ద స్వర్ణముఖినది పొర్లుకట్టను ఓ టీడీపీ నాయకుడు యంత్రాలతో ధ్వంసం చేయడంపై స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు గుప్పుమంటున్నాయి. స్వర్ణముఖిలో ఇసుక అక్రమ రవాణా కోసం రూ.కోట్ల నిధులతో నిర్మించిన పొర్లుకట్టను యంత్రాలతో తొలగించి వాహనాల రాకపోకల కోసం దారి ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఈ విషయమై స్థానికులు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ద్వారకనాథ్ రెడ్డి, ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కానీ తొలగించిన పొర్లుకట్టను పునర్‌నిర్మించకుండా దారికి అడ్డంగా గాడి తీయించి చేతులు దులుపుకోవడంపై స్థానికులు బాహాటంగా విమర్శలు చేస్తున్నారు. యంత్రాలతో తొలగించిన స్వర్ణముఖి పొర్లుకట్టను పూర్తిస్థాయిలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



